


# 'చేదు రక్తం'

డాక్టర్ తాడిమళ్ళ వెంకట నారాయణ రావు

**జనం** —ఎక్కడ చూసినా జనం! దగ్గులు, రొంపలు, నెప్పులు రకరకాల బాధలతో వందల కొద్దీ జనం కిటకిటలాడే ఆ ప్రదేశం గవర్నమెంటు ఆసుపత్రి. ఉదయం పది గంటల వేళ. భరించలేని వాసనలు. అరుపులు, కేకలు, మాటలు...ఒకటే, హడావిడి. ప్రతి వాళ్ళకీ అందరికన్నా ముందు డాక్టరు గారికి చూపించుకుని ఇంటికి వెళ్ళిపోవాలన్న తొందరే!

ఆ జనం మధ్యలో ఏవీ పట్టనట్టు మనుషుల్ని తోసుకుంటూ నడుస్తున్నాడు సూర్యం. మొహంలో జబ్బు వల్ల బాధ కానీ, తొందరగా నయం చేయించు కుని వెళ్ళి పోదామన్న ఖంగారు కానీ, పరిసరాల మీద అసహ్యం గానీ లేవు. మనిషి తెల్లగా పాలిపోయి ఉన్నాడు. గడ్డం చేసుకుని వారం పైనే అవుతుంది. లోతుకు పోయిన కళ్ళలో ఆకలి! గార కట్టిన పళ్ళు నోరు మూసుకున్నా కనిపిస్తున్నాయి. వేసుకున్న గళ్ళ షర్టు దరిద్రాన్ని దాచలేక అవస్థ పడుతూంది. పాంటు మాత్రం మాసిపోయినా, సూర్యాన్నే నమ్ముకుని అతని ఒంటికి అయిదేళ్ళ నించీ చిరక్కుండా అతుక్కునే ఉంది.

పది లోపున అనుకున్నట్టు గానే సూర్యం అక్కడికి చేరుకున్నాడు. బయట ఉన్న బల్ల మీద కూర్చున్నాడు. ఈ చోటు, ఈ జనం అతనికి కొత్త కాదు. కనీసం వారానికి ఒకసారైనా ఇక్కడికి రాక తప్పదు.

తన కున్న రోగాలు ఆస్పత్రిలో నయం చేయించు కోవాలన్న ఆలోచన సూర్యానికి ఎప్పుడూ రాలేదు. సూర్యం ఆస్పత్రికి వచ్చింది డబ్బు కోసం. తన సీసాడు రక్తానికి ప్రభుత్వం వాళ్ళు ఇచ్చే పధ్నాలుగు రూపాయిలకి, చేతిలో పెట్టే బన్ను రొట్టె కోసం వచ్చాడు సూర్యం. ఆకలి మనిషి చేత ఎంత పనేనా చేయిస్తుంది. సూర్యం చేసే పని ఆకలికి మనిషి మీద మరో మహోన్నత విజయం.

వార్డు బోయ్ గదిలోంచి సూర్యాన్ని చూసి వెకిలిగా నవ్వాడు. ఆకలే సూర్యాన్ని చూసి వికటాట్ట హాసం చేసినట్టుంది వాడి నవ్వు. నే నొచ్చేశా నన్నట్టు సూర్యం స్టాఫ్ నర్సు గారికి సైగ చేశాడు.

"డాక్టరుగారు కాఫీ కెళ్ళారు. రాగానే పద్దువు కాని. కాసేపు కూర్చో." స్టాఫ్ నర్సు మాటల్లో ఏళ్ళ కొద్దీ నేర్చుకున్న అణకువని, సీనియారిటీ వల్ల వచ్చిన అహంకారం అణిచేస్తోంది.

సూర్యం కూర్చునే ఉన్నాడు. పదకొండు అవుతూంది. బయట ఎండ. లోపల ఆకలి మంట. సూర్యం నెమ్మదిగా లేచి గదిలోకి తొంగి చూశాడు. బ్లడ్ బాంకు నర్సుగారి మొహంలోని పెద్దపులి అతన్ని చూసి గాండ్రించింది. మళ్ళీ ఉసూరుమని వెనక్కొచ్చి కూర్చున్నాడు.

సుమారు పావు తక్కువ పన్నెండుకి బ్లడ్ బాంకు డాక్టరు గారొచ్చారు. సూర్యాన్ని చూసీ చూడనట్టు చూసి లోపలి కెళ్ళిపోయారు. మరో పది నిమిషాల తరవాత వార్డు బోయ్ సూర్యాన్ని లోపలికి రమ్మన్నాడు.

సూర్యం వచ్చి డాక్టరుగారి దగ్గరున్న బల్లమీద కూర్చున్నాడు. అప్పుడే కాల్చి పారేసిన సిగరెట్టు







-ాగ నోట్లోంచి వస్తూంటే పేరు, వయసు అడిగారు. నాడి చూసి బీపీ చూశారు. నాలిక చూపించ మన్నారు.

"ఎన్నాళ్ళయిందేమిటి రక్తం ఇచ్చి?" డాక్టరు గారు అడిగారు.

"సార్?" సూర్యం ఏమీ తెలీనట్టు నటించ బోయాడు.

"ఏం వినబడదా! కిందటి సారి బ్లడ్ ఇచ్చి ఎన్నాళ్ళయింది?" డాక్టరుగారు ఈ సారి గట్టిగా అడిగారు.

"అప్పుడే పదిహేను రోజులు దాటిం ద్సార్! ఈ మధ్య పూళ్ళో లేక రాలేదు, సార్! ఒకటో తారీఖున వచ్చానంతే మళ్ళీ రాలే ద్సార్." సూర్యం బానే నటించా ననుకున్నాడు.

"లాభం లేదోయ్! నీకు ఒంట్లో రక్తం లేదు. ఐరన్ టేబ్లెట్లు వేసుకోవటం లేదా! బీపీకూడా కొంచెం తక్కువే ఉంది. వెళ్ళి ఒక వారం తరవాత రా! వార్డ్ బోయ్! ఇతనికి ఐరన్ టేబ్లెట్సిచ్చి పంపించు." డాక్టర్‌గారి గొంతులో ఆ కూర్చున్న కుర్చీ వల్లా, వేసుకున్న కోటు వల్లా వచ్చే హుందాతనం గదంతా ప్రతిధ్వనించింది.

"సార్! కొంచెం డబ్బులు అర్జెంటు, సార్! మళ్ళీ నెలదాకా రాను, సార్! సార్! నా కే జబ్బూ లేద్సార్. పచ్చ కామెర్లు కానీ, గుండె దడ, ఆయాసం కానీ లేవు, సార్! సార్! చాలా సేపటినుంచి కూర్చున్నా, సార్!" ఎంత ప్రయత్నించినా సూర్యం గొంతు కావలిసినంత దీనంగా మారటం లేదు. చిరిగిన చొక్కా వెనకాల కరకు దేలిన మనిషి.

"ఒకసారి చెపితే నీ క్కాదూ! నీ గురించి చెబు తున్నానా, నా గురించా! వెళ్ళు. వెళ్ళి ఒక వారం తరవాత కనిపించు." సూర్యం సూదంటురాయి చూపులు డాక్టరుగారి కళ్ళలో చాలా లోతుకు వెళ్ళి గుచ్చుకున్నా ఆయన చలించ లేదు. విసురుగా బయటి కొచ్చి సూర్యం జేబులోంచి ఒక బీడీ తీశాడు.

"డబ్బు కోసం ఏమైనా చేస్తారండీ! అన్నీ అబద్ధాలే! కిందటివారమే వచ్చుంటాడు. డబ్బు కోసం మళ్ళీ తయారయ్యాడు." డాక్టరుగారు గట్టిగా పైకే ఆలోచిస్తున్నారు. ఫోను మోగడంలో మాట లాగిపోయాయి.

డాక్టరుగారు ఫోన్‌లో ఏదో మాట్లాడారు. మవుత్ పీసు చేత్తో మూసి ఏబీ గ్రూపు ఒక బాటిలుందా" అని స్టాఫ్‌గార్ని అడిగారు. మళ్ళీ ఫోన్‌లో ఏదో మాట్లాడి ఫోన్ పెట్టేశారు.

"డొనేట్ బ్లడ్ అండ్ సేవ్ ఎ లైవ్"—ఎర్రటి రంగులో ఇంగ్లీషులో ఉన్న అక్షరాల కేసి బ్రిటిషు వాడు అరవం అక్షరాల్ని చూసినట్టు చూస్తున్నాడు సూర్యం బీడీ పొగ వదులుతూ. వార్డు బోయ్ ఇంతట్లో బయటి కొచ్చి సూర్యాన్ని రమ్మన్నాడు.

"పొన్లే! ఏదో ఈ సారికి అడుగుతున్నావు కదాని సరే అంటున్నాను. ఇంకెప్పుడూ ఇలా రాకు. అబ్బే ఏదీ! ఒంట్లో అసలు రక్తమే లేదు. ఇలా బల్లమీద పడుకో." ఓడిపోయినా గెలుపు నాదే అనే ధోరణిలో ఉన్నారు డాక్టరుగారు.

సూర్యం బల్లమీద పడుకున్నాడు. బీపీ చూసేది చేతికి కట్టారు. ఇంజక్షను సూది సూర్యానికి ఏమీ నెప్పనిపించ లేదు. ఎన్ని సార్లు తన రక్తం ఇలా సీసాలోకి, అందులోంచి చావు బతుకుల్లో ఉన్న శరీరాల్లోకి ప్రవహించిందో సూర్యానికి గుర్తు లేదు. సుమారు పదిహేను నిమిషాల తరవాత సూర్యం బయటి బెంచీ మీద కూర్చునాడు ఎప్పట్లాగే. స్టాఫ్‌నర్సుగారు వందల కొద్దీ కాగితాల్ని చాకచక్యంతో నింపడం మొదలెట్టారు.

సూర్యానికి మూడో బీడీ సగం కాలిన తరవాత పధ్నాలుగు రూపాయలూ, ఒక బన్ను రొట్టే చేతి లోకి వచ్చాయి. ఎవరో డాక్టరుగారికి బాగా తెలిసిన వాళ్ళకి ఏ బీ గ్రూపు అర్జంటుగా కావలిసి వచ్చిందనీ అందుకే సూర్యం బ్లడ్ తీసుకున్నట్టు వార్డు బోయ్ సూర్యం ఇచ్చిన బీడీ అందుకుంటూ చెప్పాడు.

బన్ను ముక్క కొరుక్కుంటూ ఆస్పత్రి బయటి కొచ్చిన సూర్యం మామూలుగా రోజూవెళ్ళే ప్రభుత్వం వారి దుకాణంలోకి నడిచాడు—ఎప్పటికీ మానలేని అలవాటు అది.

రాత్రి ఒంటి గంట దాటుతూంది. ఆస్పత్రి అంతా ఆ పూర్లాగానే నిద్రావస్థలో ఉంది. వార్డుల్లో సగం మంది పేషంట్లు నిద్ర పట్టక దొర్లుతూంటే వాళ్ళ తాలూకు మనుషులు వరండాల్లో, నిద్దట్లోనే దోమలతో పోరాడుతున్నారు. అంతా చీకటి. సగం వార్డుల్లోనే లైట్లున్నాయి. ఎక్కడో చీకట్లో దూరంగా ఉన్న కిళ్ళీ కొట్టునుంచి మైకులో ఏదో కొత్త సినిమా పాట అర్థం అయ్యీ అవ్వకుండా. నిద్ర పట్టకనే కాబోలు ఎక్కడో ఒక కుక్క ఆగకుండా మొరుగుతూంది.

ఆపరేషన్ థియేటరు దగ్గర మాత్రం కొంత కలకలం ఉంది. లైట్లన్నీ వెలుగుతున్నాయి. డాక్టర్ల మొహాల్లోను, వార్డు బోయిల మొహాల్లోనూ నిద్ర కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది.

పక్కనే ఒక మూలగా పేషంటు ట్రాలీ మీదు న్నాడు. సైలైను చుక్కలు చుక్కలుగా పడుతూంది. లారీ ఏక్సిడెంటులో కాలు పూర్తిగా పచ్చడై పోయింది.

ఎనస్తటిస్టు జూనియరు నర్సును మీద విసు క్కుంటున్నాడు రోజూ లాగే. సగం కోపం నిద్ర పాడు చేసినందుకేమో!

"ఇంత పూర్ జనరల్ కండిషన్‌తో ఏం చేద్దా మనండీ! అబ్బే! పల్స్ ఈజ్ వన్ టెన్. బీపీ ఈజ్ వెరీ లో! వెంటనే ఒక బాటిల్ బ్లడ్ ఎరేంజి చెయ్యండి. అదర్‌వైజ్ హి కాంట్ స్టాండ్ ఇట్."

హౌస్సర్జను బ్లడ్ శాంపిలు పట్టుకుని ఎక్కడికో విసుక్కుంటూ వెళ్ళిపోయాడు. డ్యూటీ డాక్టరు గారు పేషంటుని ఎక్సామిన్ చేస్తున్నారు. ఇరవై నిమిషాల తరవాత హౌస్సర్జను వచ్చాడు.

"గ్రూపు ఏబీ, సార్! బ్లడ్ బాంక్ లో ఒక్క బాటిలుంటే పొద్దుటే ఎవరికో ఇచ్చేశారు. ఇంక బ్లడ్ లేదు."

పేషంటుకి ఆక్సిజన్ పెట్టారు. సెలైను ఇంకా వేగంగా పోయేటట్టు ఎడ్జస్ట్ చేశారు. బీపీ చూడ్డానికి చేతికి గుడ్డ కట్టారు. అంతే! ఆ తరవాత డాక్టరు గారు చేయగలిగిందంతా చేశారు.

తాగేసి రోడ్డు మీద నడుస్తుంటే లారీ గుద్దేసిన సూర్యం అక్కడికి రావడం అదే ఆఖరు సారి. ★